క్లుప్తంగా

భక్తులకు తప్పిన మురికి నీటి ఇబ్బందులు



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దారి

ధర్మపురి: గోదావరి స్నానాల కోసం వచ్చే భక్తులకు మురికి నీటి ఇబ్బందులు తప్పాయి. గోదావరిలో పవిత్ర స్నానాలు ఆచరించి ఒడ్డుకు వచ్చే భక్తులకు వాగులో కలిసే డ్రైయినేజీ నీటి నుండి నడిచి వెళ్తున్నారు. భక్తులు మురికి నీటి బాధను తప్పించాలని ధర్మపురి దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్ బల్దియా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్ శ్రీనివాస్ వెంటనే స్పందించి తమ సిబ్బందితో శుక్రవారం తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. కమిషనర్ తక్షణం స్పందించడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



భూమిపూజ చేస్తున్న జెడ్పీ సీఈవో

రాయికల్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని జెడ్పీ సీఈవో గౌతమ్ రెడ్డి అన్నారు. మండలంలోని అల్లీపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శుక్రవారం భూమిపూజ చేశారు. అనంతరం అల్లీపూర్ ఉన్నత పాఠశాల, మహాత్మ జ్యోతిరావుపూలే రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో చిరంజీవి పాల్గొన్నారు.

విషజ్వరాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మల్లాపూర్: సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ అధికారి రామ్మోహన్ అన్నారు. మండలంలోని ముత్యంపేటలో శుక్రవారం నిర్వహించిన డ్రై డే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు ఆరోగ్యసూత్రాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఇళ్లల్లో నిలవనీటిని ఎప్పటికప్పుడూ తొలగించుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ నిర్మల, హెల్త్ అసిస్టెంట్ కృష్ణారావు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్ల దోపిడీ



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోరుట్ల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు దోపిడీకి పాల్పడుతున్నారని ముస్లిం మైనారిటీ రైట్స్ ఆర్గనైజేషన్ సంచార ముస్లిం తెగల సంఘం అడ్వైజర్ మహమ్మద్ ముజాహిద్ ఆధ్వర్యంలో శుక్రవారం కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్లు బిల్డింగ్ మెటీరియల్ ధరలు స్వచ్ఛందగా పెంచారని పేర్కొన్నారు. దీంతో ఇందిరమ్మ బేస్మింట్ లెవల్ వరకే రూ. 3 లక్షల వరకు ఖర్చవుతుందని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణంతో పేదలు మరింత అప్పుల్లో కూరుకుపోతున్నారని, ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. కార్యక్రమంలో అబ్దుల్ బారి, మొహమ్మద్ నజీబుద్దీన్, మొహమ్మద్ ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాతో లాభాలు

మెట్‌పల్లి రూరల్: నానో యూరియా వాడకంతో తక్కువ ఖర్చు, ఎక్కువ లాభాలు ఉంటాయని మెట్‌పల్లి మండల వ్యవసాయ అధికారి దీపిక అన్నారు. మెట్‌పల్లి మండలం చౌలమద్దిలో నానో యూరియా వాడకంపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో నరేశ్,రైతులు పాల్గొన్నారు.

ఫోన్ అప్పగింత

రాయికల్: మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన కచ్చుకాయల గంగారెడ్డి ఫోన్ దొంగతనానికి గురికాగా, దీనిపై స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చోరీ అయిన ఫోన్‌ను సాంకేతిక పరిజ్ఞానం కనిపెట్టి ఎస్సై సుధీర్‌రావు గంగారెడ్డికి అప్పగించారు.

సబ్‌స్టేషన్లలో లైన్‌మెన్ల కొరత

- రాయికల్ బల్దియాలో ఒకే ఒక్కడు
- ఇబ్బంది పడుతున్న వినియోగదారులు
- సిబ్బందిపై పనిభారం



రాయికల్ సబ్‌స్టేషన్

రాయికల్: వినియోగదారులకు సేవలందించేందుకు ఏలాంటి ఆటంకం లేకుండా విద్యుత్ సేవలు అందించేందుకు ట్రాన్స్‌కో అధికారులపై తీవ్ర పనిభారం పడుతోంది. మండలంలో రాయికల్, వీరాపూర్, అల్లీపూర్, ఒడ్డెలింగాపూర్, ఇటిక్యాల సబ్‌స్టేషన్లు ఉండగా కేవలం రాయికల్ మున్సిపాలిటీలో ఒకే ఒక్క లైన్‌మెన్ ఉండటంతో పట్టణ ప్రజలకు విద్యుత్ సేవలు అందించేందుకు ఉన్న సిబ్బందిపై తీవ్ర భారం పడుతోంది. రాయికల్ సబ్‌స్టేషన్ పరిధిలో రాయికల్ పట్టణం కుమ్మరిపల్లి, మైతాపూర్ గ్రామాలు ఉండగా, బల్దియాలో ఒకే ఒక్క లైన్‌మెన్ ఉన్నారు. వీరాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో వీరాపూర్, రాజనగర్, ఆలూరు, అయోధ్య, ఉప్పుమడుగు, రామాజీపేట గ్రామాలు ఉండగా ముగ్గురు ఆపరేటర్లకు ఒక్కరే ఉండగా రామాజీపేట జేఎల్ఎం పోస్టు ఖాళీగా ఉంది. అల్లీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో అల్లీపూర్, కిష్టంపేట, సింగరావుపేట, కుర్మపల్లి, శ్రీరాంనగర్ గ్రామాలు ఉండగా ముగ్గురు ఆపరేటర్లకు ఒక్కరే ఉన్నారు. కిష్టంపేట, సింగరావుపేట జేఎల్ఎంలు లేరు. ఒడ్డెలింగాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఒడ్డెలింగాపూర్, భూపతిపూర్, ఒడ్డెరకాలనీ, కొత్తపేట, మూటపల్లి, చింతలూరు, బోర్నపల్లి, జగన్నాథపూర్ గ్రామాలు ఉండగా ముగ్గురు ఆపరేటర్లకు ఒకే ఒక్క ఆపరేటర్ ఉన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఏఎల్ఎంకు జేఎల్ఎంగా పదోన్నతి రావడంతో ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. ఇటిక్యాల సబ్‌స్టేషన్ పరిధిలో ఇటిక్యాల, చెర్లకొండాపూర్, రామారావుపల్లి గ్రామాలు ఉండగా ముగ్గురు ఆపరేటర్లకు ఒకే ఒక్క ఆపరేటర్ ఉన్నారు. తాట్లవాయి సబ్‌స్టేషన్ పరిధిలో తాట్లవాయి, కైరిగూడెం, ఆల్యానాయక్, వస్తాపూర్, ధర్మాజీపేట, కట్కాపూర్, దావన్‌పల్లి గ్రామాలు ఉండగా ముగ్గురు ఆపరేటర్లకు ఒకే ఒక్క ఆపరేటర్ ఉన్నారు. ఇక్కడ కూడా ఏఎల్ఎంకు పదోన్నతి రావడంతో జేఎల్ఎంగా ఉన్న చోటే విధులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా సబ్‌స్టేషన్ల పరిధిలో ఆపరేటర్ల సమస్య, రాయికల్ మున్సిపాలిటీలో లైన్‌మెన్ల కొరత తీవ్రంగా ఉండటంతో వర్షాకాలంలో ఎక్కడ విద్యుత్ అసౌకర్యం కలిగినా ఉన్న సిబ్బందికి పనిభారమవుతోంది. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి లైన్‌మెన్ల కొరత తీర్చాలని, రాయికల్‌లో మరికొంత మంది లైన్‌మెన్లను నియమించాలని కోరుతున్నారు.

లైన్‌మెన్లను నియమించాలి



రాయికల్ బల్దియాలో ఒకే ఒక్క లైన్‌మెన్ ఉండటంతో ఏదైనా విద్యుత్ అసౌకర్యం కలిగినట్లయితే ఎవరికి చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నాం. లైన్‌మెన్లను నియమిస్తే అందరికీ అందుబాటులో ఉంటూ మరింతగా విద్యుత్ సేవలు అందిస్తారు. సిబ్బంది కొరతతో విద్యుత్ సేవలకు ఆటంకం కలుగుతోంది.

– కట్టెకోల రంజిత్, రాయికల్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



రాయికల్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మెన్ల కొరతపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ముఖ్యంగా రాయికల్ మున్సిపాలిటీలో ఒకే ఒక్క లైన్‌మెన్ ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అయినప్పటికీ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సేవలందిస్తున్నాం.

– తుమ్మల నవీన్, ట్రాన్స్‌కో ఏఈ, రాయికల్



రామభద్రునిపల్లిలో మూతపడ్డ పాఠశాల భవనం



ఉప్పుపల్లెలో పాఠశాల భవనం

నిరుపయోగంగా పాఠశాల భవనాలు

పెగడపల్లి: గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు విద్యను అందించేందుకు రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన పాఠశాలల భవనాలు వృథాగా పోతున్నాయి. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న కారణంగా ఉప్పుపల్లె, రామబద్రునిపల్లి, నామాపూర్‌లోని గొల్లపల్లె, ప్రాథమిక పాఠశాలలను ఏళ్ల క్రితం మూసివేశారు. ఈ భవనాలు ప్రస్తుతం నిరుపయోగంగా ఉండడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. లక్షలు వెచ్చించి నిర్మించిన ఆయా పాఠశాల భవనాలను వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు ప్రజాప్రతినిధులు కృషి చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. భవనాలు ఏదో రకంగా వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, సామాజిక భవనాల నిర్వహణ, గ్రామాఖ్య సంఘాలు, ఇతర ప్రభుత్వ కార్యాకలాపాలకు వినియోగించి భవనాలను పరిరక్షించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తల్లి పాలతో సంపూర్ణ ఆరోగ్యం



మెట్‌పల్లి: తల్లి పాల వల్ల చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెల్మల శ్రీనివాస్‌రావు అన్నారు. తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం బాలింతలకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇల్లెందుల శ్రీనివాస్, జోగ జగదీశ్వర్, గంప శ్రీనివాస్ తదితరులున్నారు.

పెగడపల్లి: తల్లిపాలే బిడ్డకు అత్యంత శ్రేష్టకరమైనవని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మహేశ్వరీ, సుభద్ర సూచించారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు పట్టిస్తే ఆరోగ్యకరంగా ఉంటారని, పిల్లలకు కనీసం ఆరు నెలల పాటు తల్లిపాలు తప్పకుండా పట్టించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మహేశ్వరీ, సుభద్ర, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, మహిళలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మల్లాపూర్: తల్లి పాలే బిడ్డకు వరమని, సురక్షితమని, పౌష్టికాహారమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. మండలంలోని ముత్యంపేటలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవంలో పాల్గొని మాట్లాడారు. బిడ్డ పుట్టిన అరగంటలోపే తల్లులకు వచ్చే పాలను ముర్రుపాలు అంటారని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి రామ్మోహన్, ఎంఎల్‌హెచ్‌పీ నిర్మల, హెల్త్ అసిస్టెంట్ కృష్ణారావు, కార్యదర్శి మోబిన్, అంగన్‌వాడీ టీచర్లు, ఏ ఎన్ ఎంలు, ఆశ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కోరుట్ల: పట్టణంలోని పద్మశాలీ భవనంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల కోటి నవదుర్గ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నైత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ మెడికేర్ ఐ హాస్పిటల్, రేకుర్తి వైద్యులు 84 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 32 మందికి శస్త్ర చికిత్స అవసరం కాగా రేకుర్తి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కరీంనగర్ చారిటబుల్ డాక్టర్ భాస్కర్, రేకుర్తి హాస్పిటల్ వైస్ చైర్మన్ చిదుర సురేష్, కోటి నవదుర్గ మహిళ క్లబ్ అధ్యక్షురాలు గంద్రరాదిక, కార్యదర్శి గుంటుక వందన లయన్స్ క్లబ్ ప్రతినిదులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ కళాశాల కమిటీ ఏర్పాటు

సారంగాపూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం అమ్మ ఆదర్శ కళాశాల కమిటీని ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ వై. రమేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కమిటీ అధ్యక్షురాలిగా బూర్ల వనిత, కమిటి సభ్యులుగా సంగెపు భాగ్యలక్ష్మి, నలువాల రాజవ్వ, ముదిగొండ లావణ్య, కొమ్ము స్వప్న, చేకుట మలవ్వ, కొలపాక శంకరమ్మ, నియమితులయ్యారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

జగిత్యాలరూరల్: జగిత్యాల జిల్లాలో ఐకేపీ ఏపీఎంల బదిలీలు చేపట్టారు. జగిత్యాల ఐకేపీ ఏపీఎంగా పనిచేస్తున్న ఓదెల గంగాధర్ జిల్లా కార్యాలయానికి బదిలీ కాగా, సారంగాపూర్ ఏపీఎంగా పనిచేస్తున్న తైదల రాజయ్య జగిత్యాల ఏపీఎంగా బాధ్యతలు స్వీకరించారు.

రాయికల్: రాయికల్ ఏపీఎంగా నరహరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన రాజేశ్ బదిలీపై నిర్మల్‌కు వెళ్లారు.

కథలాపూర్: మండల సెర్ప్ ఏపీఎంగా చిన్న రాజయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన నరహరి రాయికల్ మండలానికి బదిలీపై వెళ్లారు. చిన్న రాజయ్య మల్యాల నుంచి బదిలీపై వచ్చారు.

ఇబ్రహీంపట్నం: మండల ఎంపీడీవోగా ఎం.డీ సలీం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్నాళ్లు ఇబ్రహీంపట్నం ఎంపీడీవోగా కోరుట్ల ఎంపీడీవో రామకృష్ణ ఇన్‌చార్జీగా వ్యవహరించారు. సారంగాపూర్ ఎంపీవోగా పనిచేస్తున్న ఎం.డీ సలీంకు పదోన్నతి కల్పించి ఇబ్రహీంపట్నం ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవోగా బాధ్యతలు తీసుకున్న ఎం.డీ సలీంను మండల ప్రత్యేకాధికారి నారాయణ, కోరుట్ల ఎంపీడీవో రామకృష్ణ, ఏపీవో కొమురయ్య సన్మానించారు.

వెల్గటూర్ : మండల నూతన ఎంపీడీవోగా డి.కృపాకర్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు వెల్గటూర్ ఎంపీడీవోగా పదవీ బాధ్యతలు నిర్వర్తించిన జక్కుల శ్రీనివాస్ గురువారం పదవీ విరమణ చేయగా ఆయన స్థానంలో కోరుట్ల ఎంపీవోగా పని చేస్తున్న కృపాకర్‌ను వెల్గటూర్ ఎంపీడీవోగా నియమించారు.

రాయికల్: మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉదయ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన నాగార్జున ఈనెల 17 వరకు సెలవుపై వెళ్లగా కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉదయ్‌కుమార్‌కు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు.

వ్యవసాయ మోటారు చోరీ

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లిలో మధుసూదన్‌రావు వ్యవసాయ బావిలో ఉన్న విద్యుత్ మోటారును శుక్రవారం గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు కౌలు రైతు బొంగు రాజు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల వ్యవధిలో కుమ్మరిపల్లిలో రెండు విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి.

‘యూరియా విషయంలో ఎమ్మెల్యే ఆరోపణలు సరికావు’

మెట్‌పల్లి: యూరియా విషయంలో ప్రభుత్వంపై ఎమ్మెల్యే సంజయ్ తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని సింగిల్ విండో చైర్మన్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. ప్రతి సొసైటీ పరిధిలో రైతుల అవసరం మేరకు ప్రభుత్వం యూరియా సరఫరా చేసిందన్నారు. ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయడానికి ఎమ్మెల్యే యూరియా కొరత ఉందంటూ ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. సమావేశంలో పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సామూహిక కుంకుమ పూజలు



కుంకుమపూజలో పాల్గొన్న మహిళలు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో శ్రీ రేణుకాఎల్లమ్మ ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమపూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు గ్రామం నుంచి ఆలయం వరకు మంగళహారతులతో ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

పెగడపల్లి: మండలంలో శ్రావణ మాసం వేడుకలు మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. శుక్రవారం ఆలయాలు సందడిగా మారాయి. మహిళలు ఉదయాన్నే ఆలయాల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసశర్మ భక్తులకు తీర్థ ప్రసాదం అందజేశారు.



పెగడపల్లి: మండలంలోని నందగిరి–పెగడపల్లి రహదారిపై ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాలువ వంతెనపై ఇసుక మేటలతో పాటు తరుచుగా కురుస్తున్న వర్షపు నీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గతంలో వంతెనకు రెండు వైపుల తారు వేసి వంతెనను వదిలేశారు. ఓ వైపు వంతెనపై ఇసుక మేట, మరోవైపు మోకాలి లోతు వర్షపు నీరు నిలుస్తుంది. దీంతో వంతెనపై వెళ్లాలంటే ద్విచక్ర వాహనాదారులు జంకుతున్నారు. వంతెనను మరమ్మతు చేయించి నీరు నిల్వకుండా చూడాలని సంబంధిత అధికారులను ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రమేశ్, ఎస్సారెస్పీ డీఈ, సెల్ నంబర్ : 9963227157

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

రాబోయే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుపొందాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలుపొందాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని రామన్నపేటలో వెల్మ లక్ష్మారెడ్డి అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ స్థానిక సంస్థ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. నూకపల్లి గ్రామానికి చెందిన నులుగొండ భూమయ్య కుటుంబ సభ్యులకు రూ.5లక్షల విలువైన రైతుబీమా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో దొంగ ఆనంద రెడ్డి, బత్తిని శ్రీనివాస్, దారం ఆదిరెడ్డి, ముత్యాల రాంలింగారెడ్డి, మ్యాక లక్ష్మణ్, శనిగరపు తిరుపతి, నేరెళ్ల సతీశ్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొడిమ్యాల: ప్రతీ కుటుంబానికి ప్రజాప్రభుత్వం అండగా ఉంటుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండల కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు చెక్కులుపంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వమని వచ్చే ఇంకో పదేళ్లు తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుదని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో స్వరుపా,ఆర్ఐ కరణ్, ఏఎంసీ వైస్ చైర్మన్ జీవన్,మండల అధ్యక్షులు నారాయణ పాల్గొన్నారు.

రైతులను మభ్యపెట్టేందుకే బీఆర్ఎస్‌వి తప్పుడు ఆరోపణలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మల్లాపూర్: యూరియా పంపిణీపై రైతులను మభ్యపెట్టేందుకే ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ తప్పుడు ఆరోపణలు చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు సరిపడా యూరియాను అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపైన ఎమ్మెలే సంజయ్ నిరాధారమైన విమర్శలు, తప్పుడు ఆరోపణలు చేయడం దారుణమన్నారు. ఎమ్మెల్యే సంజయ్ చేసిన ఆరోపణలపై కట్టుబడి శనివారం కోరుట్ల మండలంలోని ఐలాపూర్‌లో రైతువేదిక వద్ద కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావుతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలతనర్సయ్య, వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, మాజీ చైర్మన్ సుంకేటి నారాయణరెడ్డి, డైరెక్టర్ నూతిపెల్లి రాజం, నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

మల్యాల: మండలంలోని తక్కళ్లపల్లి గ్రామ పంచాయతీని స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా గ్రామంలో ఇంకుడు గుంతలు, మౌలిక వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

రాయికల్: మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాజేశ్ తెలిపారు. 6వ తరగతిలో 43, 7వ తరగతిలో 47, 8లో 27, 9లో 10, 10వ తరగతిలో 9, 11లో 44, 12లో 57 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆగస్టు 10 లోపు మోడల్‌స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

కరీంనగర్‌కు తరలిన బీఆర్ఎస్ నాయకులు

జగిత్యాల: స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లపై కరీంనగర్‌లో జరిగిన సమావేశానికి జగిత్యాల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. వెంటనే బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో చర్చలకు సిద్ధంగా ఉన్నాం

కోరుట్ల రూరల్: రైతులకు ప్రభుత్వం చేస్తున్న యూరియా సరఫరాపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని అయిలాపూర్ రైతు వేదికలో నిర్వహించే చర్చా వేదికలో పాల్గొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పలువురు బీఆర్ఎస్ తాజా మాజీ సర్పంచులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ సర్పంచులు పిడుగు రాధ సందయ్య,ఇప్ప మంగా–దేవేందర్ , వనతడుపుల అంజయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడిన మాటల్లో నిజాలు ఉన్నాయని, రైతుకు యూరియాతో పాటు జింక్ బ్యాగు కూడా ఇచ్చినట్లు తాము ఆధారాలతో సహా చూపుతామన్నారు.

బీమా ప్రతి కుటుంబానికీ ధీమా

కొడిమ్యాల: మండల కేంద్రంలోని ఆంధ్ర బ్యాంక్ ఆవరణలో భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ప్రధాన మంత్రి జీవన బీమా యోజన ,ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన నమోదు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ రీజనల్ హెడ్ శ్రీలత మట్లాడూతూ ఎదైనా బ్యాంక్ లేదా పోస్టాఫీస్‌లో ఖాతా కలిగి ఉండి 18–70 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. కార్యక్రమంలో ఆర్బీఐ ఎల్బీవో యశ్వంత్, రామ్‌కుమార్,వైభవ్,సంజీవ్,సురేశ్,మధు,గజానన్,స్వామి తదితరులు పాల్గొన్నారు.